సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 23 । సెప్టెంబర్ । 2025



చీనీ టన్ను రూ.17 వేలు
అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.17 వేలు, కనిష్టంగా రూ.8 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.25
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.25, కనిష్టంగా రూ.13 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
33.6°/20.4°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో పశ్చిమ దిశగా గాలి వీచింది.

శరన్నవరాత్రి శోభ

- అంగరంగ వైభవంగా దసరా ఉత్సవాలు ప్రారంభం
- తొలిరోజు వివిధ రూపాల్లో అమ్మవారి దర్శనం
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

పుట్టపర్తి టౌన్/లేపాక్షి: జిల్లాలో శరవన్నరాత్రి ఉత్సవాలు సోమవారం అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. శక్తి స్వరూపిణీ అమ్మవారు తొలిరోజు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారి దర్శనానికి తెల్లవారుజామునే భక్తులు బారులు తీరగా, ఆయా ఆలయాలు కిటకిటలాడాయి. పుట్టపర్తిలో వెలసిన సత్యమ్మ బాలా త్రిపురసుందరిగా, వాసవీమాత రాజరాజేశ్వరిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఇక లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయంలో దుర్గాదేవి బాలా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలోని వీరభద్రస్వామిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. లేపాక్షి దుర్గమ్మ మంగళవారం గాయత్రీదేవి అలంకరణలో దర్శనమివ్వనున్నారు.



బాలాత్రిపురసుందరి అలంకరణలో పుట్టపర్తి సత్యమ్మ తల్లి



పుట్టపర్తిలో రాజరాజేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చిన వాసవీమాత



బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో లేపాక్షి దుర్గమ్మ



ధర్మవరం అర్బన్: బాలాత్రిపురసుందరీదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరిదేవి

న్యూస్‌రీల్

19 మండలాల్లో వర్షం



పెదపల్లిలో ఓ వీధిలో పారుతున్న వర్షపు నీరు

పుట్టపర్తి అర్బన్: తుపాను ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకూ 19 మండలాల పరిధిలో 145.4 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఓడీచెరువు మండలంలో 28.2 మి.మీ, సోమందేపల్లి మండలంలో 22.0 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక బత్తలపల్లి మండలంలో 18.2 మి.మీ, పెనుకొండ 9.2, పుట్టపర్తి 9.2, ఎన్పీ కుంట 9.0, ముదిగుబ్బ 8.2, బుక్కపట్నం 7.2, నల్లమాడ 5.0, నల్లచెరువు 4.8, ధర్మవరం 4.2, అమడగూరు 4.2, గాండ్లపెంట 2.6, తనకల్లు 2.4, తాడిమర్రి, కదిరి, కొత్తచెరువు, సీకేపల్లి, రామగిరి మండలాల్లో 2.2 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. జిల్లాకు మరో రెండురోజులు వర్ష సూచన ఉందని వెల్లడించారు.

బీఎల్‌ఏలను నియమించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యాం ప్రసాద్

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల ప్రక్రియ సజావుగా జరగడంలో భాగంగా అన్ని రాజకీయ పార్టీలు బూత్‌లెవల్ ఏజెంట్లను (బీఎల్‌ఏ) నియమించుకోవాలని కలెక్టర్ శ్యాం ప్రసాద్ సూచించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఓటరు నమోదు, జాబితా సవరణ, కేంద్రాల్లో సౌకర్యాలు, ఓటింగ్ శాతం పెంపుపై రాజకీయ పార్టీల నుంచి అభ్యంతరాలు, సూచనలు స్వీకరిస్తామన్నారు. అందువల్ల ప్రతి పార్టీ బీఎల్‌ఏలను నియమించి వారి వివరాలను ఎన్నికల అధికారికి సమర్పించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ సూర్యనారాయణరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ జాకీర్ హుస్సేన్, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


తీరని యూరియా కష్టాలు



రొళ్లలోని గోదాము వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

రొళ్ల: రైతులను యూరియా కష్టాలు వెంటాడుతున్నాయి. రెండు, మూడు పంచాయతీలకు కలిసి ఒకచోట యూరియా పంపిణీ చేస్తుండటంతో బస్తా యూరియా దక్కించుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. రొళ్ల మండలంలోని హులికుంట, రొళ్ల-1, రొళ్ల-2తో పాటు హొట్టేబెట్ట ఆర్‌ఎస్‌కే పరిధిలోని రైతులకు సోమవారం రొళ్లలో యూరియా పంపిణీ చేస్తామని ప్రకటించారు. దీంతో ఉదయమే వందలాది మంది రైతులు అక్కడికి చేరుకున్నారు. గోదాములో 280 బస్తాలుండగా... వాటిని మాత్రం పంపిణీ చేసిన అధికారులు అనంతరం గోదాముకు తాళం వేశారు. దీంతో 350 మందికిపైగా రైతులకు యూరియా అందలేదు. దీంతో వారంతా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా పంపిణీ చేసేంత వరకూ ఇక్కడే ఉంటామని రైతులు భీష్మించుకుని కూర్చోవడంతో ఏఓ వెంకటబ్రహ్మం వారికి సర్దిచెప్పారు. ప్రస్తుతం టోకెట్లు ఇస్తామని, ఒకట్రెండు రోజుల్లో యూరియా పంపిణీ చేస్తామని చెప్పడంతో రైతులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

‘గౌరవం’ ఏదీ..?



- ఇమామ్‌లు, మౌజన్లకు అందని గౌరవ వేతనం
- 11 నెలల బకాయి పెట్టిన కూటమి ప్రభుత్వం
- కుటుంబ జీవనానికి ఇబ్బందులు పడుతున్న మత పెద్దలు
- ఎన్నికల కోడ్ వరకూ సకాలంలో అందించిన గత ప్రభుత్వం
- జిల్లావాసులకు రూ.20.85 కోట్లు చెల్లించిన వైనం

☛ పెనుకొండకు చెందిన ఓ ఇమామ్ ఏళ్లగా ప్రభుత్వం అందజేసే గౌరవ వేతనంతోనే కుటుంబాన్ని పోషించుకునేవారు. గత ప్రభుత్వ హయాంలో క్రమం తప్పకుండా డబ్బు అందేది. 2024 ఎన్నికల నోటిఫికేషన్‌తో ‘కోడ్’ అడ్డురాగా, అప్పట్లో 3 నెలల గౌరవ వేతనం పెండింగ్ పడింది. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ మూడు నెలల బకాయిని ఎగ్గొట్టింది. అందరూ ఒత్తిడి చేయడంతో ఇప్పటిదాకా 6 నెలలకు మాత్రమే గౌరవ వేతనం ఇచ్చి చేతులు దులుపుకుంది. ఈ పరిస్థితుల్లో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారగా.. సదరు ఇమామ్ దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అప్పు చేస్తే తీర్చే ధైర్యంలేక... చేయిచాచి అర్థించలేక పస్తులుంటున్నారు. ఇలాంటి ఇమామ్‌లు, మౌజన్లు జిల్లాలో 300 మంది దాకా ఉన్నారు. తమకు ‘గౌరవం’గా బతికే అవకాశం ఇవ్వాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కదిరి: ముస్లిం, మైనార్టీల సంక్షేమాన్ని కూటమి సర్కార్ పూర్తిగా విస్మరించింది. ముస్లింలను భక్తిమార్గంలో నడిపే ఇమామ్‌లు, మౌజన్లకు భుక్తి లేకుండా చేస్తోంది. ‘గౌరవ’ వేతనం కూడా ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతోంది. ఈ క్రమంలో పూటగడవని చాలా మంది ఇమామ్, మౌజన్లు ఇప్పటికే కలెక్టర్‌ను కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. అయినా ఫలితం లేకుండా పోయింది.

గతంలో బకాయిల సమస్యే లేదు..

ఆదాయం తక్కువగా ఉండే చిన్న మసీదులపై ఆధారపడి జీవించే ఇమామ్, మౌజన్లకు ప్రతి నెలా గౌరవ వేతనం ఇవ్వాలని గత జగన్ ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రకారం జగన్ హయాంలోనే ఇమామ్‌లు, మౌజన్లకు గౌరవ వేతనాలు చెల్లించడంలో ఏనాడూ బకాయి పెట్టలేదు. గత ఏడాది మార్చి వరకూ అంటే ఎన్నికల కోడ్ వచ్చే వరకూ నెలకు మౌజన్లకు రూ.10 వేలు, ఇమామ్‌లకు రూ.5 వేల చొప్పున ఎప్పటికప్పుడు అందించింది. గత ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా 298 మంది మౌజన్‌లు, ఇమామ్‌లకు మొత్తం రూ.20.85 కోట్లు అందజేసింది. మార్చిలో ఎన్నికల కోడ్ రావడంతో ఆ తర్వాత ఏప్రిల్, మే, జూన్ మాసాలకు సంబంధించిన గౌరవ వేతనం ఇవ్వలేక పోయింది. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ మూడు నెలల గౌరవ వేతనం ఎగ్గొట్టింది. మొత్తం 17 నెలల గౌరవ వేతనం ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి దాకా కేవలం 6 నెలలకు మాత్రమే విడుదల చేసి సరిపెట్టింది. ఇంకా 11 నెలల బకాయి పెట్టింది.

గత ప్రభుత్వం ఇచ్చిన గౌరవవేతనం వివరాలు ఇలా..

నియోజకవర్గం	ఇమామ్, మౌజన్ల సంఖ్య	లబ్ధి (రూ.కోట్లలో)
కదిరి	67	రూ.4.62
ధర్మవరం	61	రూ.4.20
పుట్టపర్తి	34	రూ.2.65
హిందూపురం	47	రూ.3.25
మడకశిర	23	రూ.1.58
పెనుకొండ	51	రూ.3.52
రాప్తాడు	15	రూ.1.03
మొత్తం	298	రూ.20.85

మసీదుల నిర్వహణ బకాయిలు రూ.91 లక్షలు

ఎన్నికల సమయంలో చంద్రబాబుతో పాటు ఆయనతో జత కట్టిన జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ రాష్ట్రంలో మసీదుల నిర్వహణకు నెలకు రూ.5 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటి దాకా రూపాయి కూడా మంజూరు చేయలేదు. జిల్లాలో సుమారు 130 మసీదులున్నాయి. అంటే ఒక్కో మసీదుకు రూ.5 వేల చొప్పున నెలకు రూ.6.50 లక్షలు చెల్లించాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మొత్తంగా 14 నెలల కాలానికి జిల్లాలోని మసీదుల నిర్వహణ కోసం రూ.91 లక్షలు బకాయి పడింది. ఇక షాదీతోఫా పేరుతో రూ.లక్ష చొప్పున చెల్లిస్తామన్న హామీని కూడా కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కింది.

మండిపడుతున్న మత పెద్దలు..

సమాజాన్ని శాంతిమార్గంలో నడిపే మతపెద్దల సంక్షేమాన్ని కూటమి సర్కార్ విస్మరించడంతో ఆయా వర్గాల వారు మండిపడుతున్నారు. కూటమి సర్కారు వెంటనే ముస్లింలకు ఇచ్చిన హామీలతో పాటు ఇమామ్, మౌజన్లకు ఇవ్వాల్సిన గౌరవ వేతనం బకాయిలు తక్షణం విడుదల చేయాలని వారు కోరుతున్నారు.

శ్వేతపత్రం విడుదల చేయాలి



కూటమి ప్రభుత్వం ముస్లింలకు ఎన్నో హామీలిచ్చింది. కానీ ఇప్పటి వరకూ ఒక్క హామీ నెరవేర్చలేదు. సీఎం చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే తక్షణం వాటిపై శ్వేతపత్రం విడుదల చేయాలి. మైనార్టీల సంక్షేమం కోసం విడుదల చేసిన నిధుల వివరాలు కూడా అందులో పొందుపరచాలి. కూటమి సర్కారు ఇమామ్, మౌజన్లకు సకాలంలో గౌరవ వేతనం కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉంది. – సి.అన్వర్ అహ్మద్, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, చిలమత్తూరు మండలం

బకాయిలు విడుదల చేయాలి



అత్యంత పేదరికంలో ఉన్న ఇమామ్‌లు, మౌజన్లకు గత జగన్ సర్కార్ గౌరవ వేతనం ఇచ్చి ఆదుకుంది. కానీ కూటమి సర్కార్ ఇంతవరకూ వారి గురించి పట్టించుకోవడం లేదు. గత ఏడాది ఎన్నికల సమయంలో ఇవ్వాల్సిన 3 నెలల వేతనంతో పాటు ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి దాకా..ఇలా మొత్తం 11 నెలల గౌరవ వేతనం ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే వారి తరఫున పోరాటాలకు దిగుతాం. – ఎస్ఎండీ ఇస్మాయిల్, మైనార్టీ నేత, వైఎస్సార్‌సీపీ, కదిరి

ప్రశాంతి నిలయంలో దసరా వేడుకలు ప్రారంభం



దసరా వేడుకలను ప్రారంభిస్తూ కలశస్థాపన చేస్తున్న రుత్వికులు

ప్రశాంతి నిలయం: దసరా వేడుకలు సోమవారం ప్రశాంతి నిలయంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకలను పురస్కరించుకుని సాయికుల్వంత్ సభా మందిరాన్ని, సత్యసాయి మహాసమాధిని ఫల,పుష్పదళాలతో తీర్చిదిద్దారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి వేడుకలను ప్రారంభించారు. రుత్వికులు వేదమంత్రోచ్చారణ నడుమ కళశ స్థాపన క్రతువును నిర్వహించారు. అనంతరం కుంకుమార్చన, అష్టోత్తర శాత నామావళి నిర్వహించారు. వేలాది మంది భక్తులు వేడుకలలో పాల్గొని సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

రెండెకరాలు రాసిస్తే..
వన్‌బీ ఇస్తా

- గోరంట్ల తహసీల్దార్ నిర్వాకం
- కలెక్టర్ ఎదుట బాధితురాలు గగ్గోలు



తహసీల్దార్ రెండు ఎకరాలు రాసివ్వాలని డిమాండ్ చేస్తున్నారని వాపోతున్న లక్ష్మీనరసమ్మ

పుట్టపర్తి అర్బన్: ‘‘నాకు రెండెకరాలు రాసిస్తే నీ 16.14 ఎకరాలకు వన్‌బీ ఇస్తా’ అంటూ గోరంట్ల తహసీల్దార్ మారుతీప్రసాద్ వేధిస్తున్నారని బాధితురాలు కలెక్టర్ శ్యాంప్రసాద్ ఎదుట వాపోయారు. పట్టాదార్ పాసుపుస్తకం, వన్‌–బీతో పాటు రెవెన్యూ సమస్య ఏది పరిష్కరించాలన్నా తహసీల్దార్ భారీగా డబ్బు డిమాండ్ చేస్తున్నారని పలువురు బాధితులు సోమవారం కలెక్టర్‌కు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. ఆయనపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు.

- తనకు వారసత్వంగా పులేరు రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్ 608–2సీ, 616–1లోని 16.14 ఎకరాల భూమికి పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇవ్వాలని కోరితే..రెండు ఎకరాలు రాసివ్వాలని తహసీల్దార్ చెబుతున్నారని గోరంట్ల మండలం మేరెడ్డిపల్లికి చెందిన బయప్ప భార్య లక్ష్మీనరసమ్మ కలెక్టర్ ఎదుట వాపోయారు. భర్తను కోల్పోయిన తాను ఆ భూమినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నానన్నారు. 2024లోనే ఆర్డీఓ పాస్ పుస్తకం మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేసినా తహసీల్దార్ మారుతీ ప్రసాద్ పట్టించుకోలేదన్నారు.
- తన తండ్రి మదార్ సాబ్ 1979లో కమ్మ నరసప్ప నుంచి సర్వే నంబర్ 326–2డీలోని 17.27 ఎకరాలు కొనుగోలు చేశారని, అప్పటి నుంచి తామే సాగు చేసుకుంటున్నామని, రెవెన్యూ రికార్డులన్నింటిలోనూ తమపేర్లే ఉన్నా తహసీల్దార్ మారుతీ ప్రసాద్ ఇబ్బంది పెడుతున్నారని గోరంట్ల మండలం గుమ్మయ్యగారిపల్లికి చెందిన ఫకృద్దీన్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన లంచంగా అడిగిన రూ.50 వేలు ఇవ్వనందుకు రాజకీయ నాయకులను పంపి పొలానికి కంచె వేయించడంతో పాటు చెట్లు తొలగించారని వాపోయారు.
- తన తండ్రి ద్వారా సంక్రమించిన 5.18 ఎకరాల భూమిని తనకు దక్కకుండా తహసీల్దార్ మారుతీ ప్రసాద్, వీఆర్‌ఓ పవన్ ఇబ్బందులకు గురి చేస్తున్నారని పుట్టగుండ్లపల్లికి చెందిన నారాయణప్ప కుమారుడు సీతారాములు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తాము ఆ భూమిని 1962లోనే కొనుగోలు చేశామన్నారు. 63 ఏళ్లుగా సాగులో ఉన్న తనకు వన్‌బీ ఇవ్వాలని కోరితే... సదరు సర్వే నంబర్ వివాదం కోర్టులో నడుస్తోందని, తహసీల్దార్ ఇబ్బందులు పెడుతున్నారన్నారు.

వీఆర్‌ఏల ఉద్యమం తీవ్రతరం



పుట్టపర్తిలో ధర్నా నిర్వహిస్తున్న వీఆర్‌ఏలు

- ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా. కలెక్టర్‌కు వినతిపత్రం

పుట్టపర్తి అర్బన్: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరుబాట పట్టిన గ్రామ సహాయకులు (వీఆర్‌ఏ) ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు. ఇందులో భాగంగా జిల్లాలోని వీఆర్‌ఏలంతా సోమవారం పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వీరికి ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దన్న మాట్లాడుతూ.. గ్రామాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లే వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని వివిధ రూపాల్లో ధర్నాలు, నిరసనలు తెలిపినా... కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేయాలని, అర్హులైన, చదువుకున్న వారికి అటెండర్, వీఆర్‌ఓ, డ్రైవర్ ఉద్యోగాలు ఇవ్వాలని, ఎవరైనా మృతి చెందితే కారుణ్య నియామకాలు చేయాలన్న డిమాండ్లు ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే తమ డిమాండ్లు నెరవేర్చాలని, లేకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. కూటమి నేతలు ఎన్నికల్లో కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోవడం మానేశారన్నారు. ఇలాగే కొనసాగితే ప్రభుత్వానికి ఇబ్బందులు తప్పవన్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి కలెక్టర్ శ్యాం ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాద్రి, సీపీఐ నాయకులు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

మీరైనా దయ చూపండయ్యా



ఈ చిత్రంలోని మహిళ పేరు ఇడుగుట్టు కాంతమ్మ, ఎనుములపల్లి గ్రామం. పదేళ్ల క్రితం ఇన్‌ఫెక్షన్ సోకి కాలు తీసి వేశారు. దీంతో ఒంటి కాలితోనే కాలం వెళ్లదీస్తోంది. ఏ పనీ చేయలేని పరిస్థితి. గతంలో ప్రభుత్వం దివ్యాంగ పింఛన్ అందించేది. కానీ నల్లమాడకు చెందిన ఓ వైద్యుడు సదరం సర్టిఫికెట్ల మంజూరులో అవినీతికి పాల్పడ్డాడని ఆయన ఇచ్చిన సర్టిఫికెట్లను రెండేళ్ల క్రితం రద్దు చేశారు. ఆ వైద్యుడి వద్దే సర్టిఫికెట్ పొందిన కాంతమ్మ సర్టిఫికెట్ రద్దుకాగా, అధికారులు పింఛన్ జాబితాలోంచి పేరు తొలగించారు. దీంతో రెండేళ్లుగా ఆమె మండల, జిల్లా స్థాయి అధికారులకు మొరపెట్టుకుంటున్నా.. ఎవరూ పింఛన్ మంజూరు చేయించలేదు. కొత్త కలెక్టర్‌పై కోటి ఆశలతో సోమవారం కూడా కలెక్టర్‌కు వచ్చి అర్జీ ఇచ్చారు.

- నూతన కలెక్టర్‌కు ప్రజల మొర
- పరిష్కార వేదికకు భారీగా విచ్చేసిన జనం
- వివిధ సమస్యలపై అర్జీలు ఇచ్చిన వైనం



కలెక్టర్ శ్యాం ప్రసాద్‌కు తన సమస్యను వివరిస్తున్న ఓ అర్జీదారుడు

పుట్టపర్తి అర్బన్: ‘‘అయ్యా మా సమస్యలపై పదుల సార్లు అర్జీలిచ్చాం. మా కష్టాలు తీర్చినోళ్లే లేరు. మీరైనా మాపై దయచూపండయ్యా’’ అంటూ ప్రజలు నూతన కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు మొరపెట్టుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’కు వివిధ సమస్యలపై మొత్తంగా 243 అర్జీలు అందాయి. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ సూర్యనారాయణరెడ్డి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ తదితరులు వేదికపై నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమావేశమయ్యారు. జనం ఎంతో నమ్మకంతో కలెక్టర్ వరకూ అర్జీలిస్తున్నారని, వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా అర్జీలన్నీ సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు.

అందిన అర్జీల్లో కొన్ని ఇలా..

- తమ మహిళా సంఘంలోని సభ్యురాలు పద్మావతి తమకు సంతకాలను ఫోర్జరీ చేసి సంఘంలోని డబ్బు రూ. లక్ష కాజేసిందని పుట్టపర్తి మండలం సుబ్బరాయనిపల్లి గ్రామంలోని వినాయక మహిళా సంఘం సభ్యులు కలెక్టర్‌కు విన్నవించారు. వెలుగు సీసీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా తమనే బెదిరిస్తున్నారన్నారు. సంఘం డబ్బు తిరిగి చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.
- తాను 8 ఏళ్ల నుంచి జైపూర్ కాలు సాయంతో నడుస్తున్నానని, ఏ పనీ చేసుకోలేని తనకు అధికారులు రూ. 4 వేల పింఛన్ ఇస్తున్నారని, దయచేసి తనకు రూ.10 వేల పింఛన్ ఇప్పించి ఆదుకోవాలని చిలమత్తూరుకు చెందిన లలితమ్మ కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు.

- రైతులకు ఫోన్ చేస్తున్న విద్యుత్ అధికారులు

పంటకు పవర్ ఇస్తాం

సాక్షి ఎఫెక్ట్..

కదిరి: వ్యవసాయ బోరు బావులకు కరెంటు కనెక్షన్ కోసం దరఖాస్తు చేసి ఏడాదిగా ఎదురు చూస్తున్న రైతులను విద్యుత్ అధికారులు కరుణించారు. రైతుల కరెంటు కష్టాలపై ‘పంటకు పవర్ లేదు’ శీర్షికన ఆదివారం ‘సాక్షి’లో ప్రచురించిన కథనం కూటమి ప్రభుత్వాన్ని కుదిపేసింది. ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ స్థాయిలో దీనిపై సోమవారం తీవ్ర చర్చ జరిగింది. పెండింగ్ దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ప్రభుత్వం జిల్లా ఉన్నతాధికారులకు ఆదేశించింది. దీంతో జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ కొమ్ము సంపత్‌కుమార్ జిల్లాలోని విద్యుత్ శాఖ అధికారులకు ఆయనే స్వయంగా ఫోన్ చేసి వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇక ఎస్టిమేషన్‌కు కూడా నోచుకోని దరఖాస్తుల విషయంలో బాధ్యులైన అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ముడుపుల కోసం ఇన్నాళ్లు రైతులను వేధించిన కొందరు అధికారులు...దెబ్బకు దారికొచ్చారు. వారే రైతులకు ఫోన్ చేసి రెండే రోజుల్లో కరెంట్ కనెక్షన్ ఇస్తామని చెబుతున్నారు. దీంతో రైతులు ఆనందపడుతున్నారు.

క్లుప్తంగా

విగ్రహం వెతికి పెట్టమన్నందుకు కేసు కట్టారు!

చెన్నేకొత్తపల్లి: నంది విగ్రహం రికవరీలో నిర్ల క్ష్యాన్ని నిరసిస్తూ ముష్టికోవెల గ్రామపంచాయతీ ప్రజలు ఆందోళన చేపడితే... విధులకు ఆటంకం కలిగించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించారంటూ 11 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ముష్టికోవెల సమీపంలోని పురాతన శివాలయంలో ఈ నెల 4వ తేదీ రాత్రి దుండగులు నందీశ్వరుడి విగ్రహాన్ని ఎత్తుకెళ్లారు. అదే రోజు గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో పాటు విగ్రహాన్ని ఎత్తుకెళ్లిన వారిని పట్టుకోవాలని కోరారు. కేసు కొలిక్కి రాకపోవడంతో పంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజలు ఈ నెల 20న పోలీస్‌స్టేషన్‌కు పెద్ద ఎత్తున తరలి వచ్చి నిరసన తెలియజేశారు. న్యామద్దెల సర్కిల్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు 30 యాక్ట్ అమల్లో ఉన్నా అతిక్రమించి ఊరేగింపుగా నినాదాలు చేస్తూ రావడంతో పాటు తమ విధులకు ఆటంకం కలిగించారని 11 మందిపై కేసు నమోదు చేసి, వారికి 41ఏ నోటీసులు అందజేశామని ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

మద్దిలేరు వాగును చెరబట్టారు

- ఆక్రమణలతో కుంచించుకుపోతున్న వైనం
- అధికారుల పర్యవేక్షణ లేకే అక్రమ కట్టడాలు
- చెత్త, వ్యర్థాలతో వాగు ప్రవాహానికి అడ్డంకులు
- జనావాసాల్లోకి చేరుతున్న వర్షపునీరు, మురుగు
- దుర్గంధం నడుమ శ్రీవారి ఆలయానికి వెళ్తున్న భక్తులు


మద్దిలేరువాగుపై చెత్త, ఆస్పత్రి వ్యర్థాలు ఇలా..


వాగులోకి వేసిన కోళ్ల వ్యర్థాలు

కదిరి అర్బన్: వర్షపునీరు సాఫీగా సాగిపోవాల్సిన మద్దిలేరు వాగు ఆక్రమణలతో కుంచించుకుపోయింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆక్రమణదారులు చెలరేగిపోతున్నారు. మద్దిలేరు వాగు కదిరి పట్టణంలో మూడు కిలోమీటర్ల మేరకు ప్రవహిస్తుంది. కుమ్మరవాండ్లపల్లి వితలరాయుని చెరువు మరువనీరు, దేవలచెరువు మరువనీరు రెండూ కలిసే పూలబజార్ వద్ద మద్దిలేరు వాగు ప్రారంభమవుతుంది. వంద అడుగులపైబడి వెడల్పు ఉన్న మద్దిలేరు వాగు నేడు అక్రమ కట్టడాలతో 30 అడుగులకు తగ్గిపోయింది.

చెత్త, వ్యర్థాలతో నింపేశారు!

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి కోనేరు సమీపంలో ప్రవహించే మద్దిలేరు వాగు చెత్తతో నిండిపోయింది. పర్వదినాల్లో కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వస్తుంటారు. నిర్దేశిత పార్కింగ్ స్థలం చాలకపోవడంతో భక్తులు రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలుపుతున్నారు. పండుగల వేళ ఆలయానికి వచ్చే భక్తులు ఈ వ్యర్థాలపైనే అతి కష్టం మీద వాహనాలు పార్కింగ్ చేయాల్సి వస్తోంది. ఈ ప్రదేశంలో చెత్త వేస్తే రూ.10 వేలు జరిమానా అని మున్సిపల్ అధికారులు హెచ్చరిక బోర్డుపెట్టినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

వర్షాలు వస్తే దుర్గంధమే..

పట్టణంలోని చెత్త, కోళ్ల వ్యర్థాలు, ఆస్పత్రుల వేస్టేజ్, భవన నిర్మాణాల వ్యర్థాలను మద్దిలేరు వాగులోకి తెచ్చి పడేస్తున్నారు. భారీ వర్షాల సమయంలో ఇవన్నీ నీటి ప్రవాహానికి అడ్డు పడుతున్నాయి. దీంతో వర్షపునీటితో పాటు మురుగు నీరు జనావాసాల్లోకి చేరి దుర్గంధం వెదజల్లుతోంది. వ్యర్థాలు, మురుగునీరు నిల్వ ఉండిపోవడంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు జబ్బులబారిన పడుతున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



రాత్రిపూట, తెల్లవారుజామున చెత్త, వ్యర్థాలు వేసేసి పోతుంటారు. ఈ ప్రాంతంలో సీసీ కెమెరా అమర్చితే చెత్త వేసేవాళ్లను పట్టుకుని జరిమానా విధించవచ్చు. అధికారులు ఈ దిశగా ఆలోచించి మద్దిలేరు వాగును కాపాడాలి. తద్వారా పట్టణంలో చెత్త లేకుండా చేసి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలి. – ఈశ్వర్‌రెడ్డి, కదిరి

కఠిన చర్యలు తీసుకుంటాం



మద్దిలేరు వాగుపక్కన చెత్త వేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అక్కడ పోలీసుల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి.. చెత్తవేసే వారి భరతం పడతాం. ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు అన్ని చర్యలూ తీసుకుంటాం. – కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

డీఎస్సీ అభ్యర్థులకు 25న నియామకపత్రాలు

అనంతపురం ఎడ్యుకేషన్: డీఎస్సీ-2025కు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 25న విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ చేతుల మీదుగా నియామకపత్రాలు అందజేస్తారని డీఈఓ ఎం.ప్రసాద్‌బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎంపికైన అభ్యర్థులు, వారికి తోడుగా వచ్చే సహాయకుల కోసం మొత్తం 45 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 24న తెల్లవారుజామున 5 గంటలలోపు అనంతపురం రూరల్ మండలం ఆలమూరు రోడ్డులోని బాలాజీ పీజీ కళాశాల వద్దకు చేరుకోవాలని సూచించారు. అభ్యర్థులు, వారి సహాయకులు ఆధార్‌కార్డు, బెడ్‌షీటు, తలదిండు, గొడుగు, స్వెటర్ తెచ్చుకోవాలని పేర్కొన్నారు. ఇదివరకే ఎంట్రన్స్ ఐడీ కార్డులు తీసుకున్న అభ్యర్థులు, సహాయకులు తప్పనిసరిగా వాటని వెంట తెచ్చుకోవాలని డీఈఓ సూచించారు.

సెపక్‌తక్రా పోటీల రన్నర్ అనంత


రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా ఫైనల్ పోటీల్లో తలపడిన అనంతపురం-కృష్ణా జిల్లాల జట్లు

ఉరవకొండ: రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీల ఓవరాల్ విజేతగా కృష్ణా జిల్లా బాలబాలికల జట్లు నిలిచాయి. ఆతిథ్య అనంతపురం జిల్లా జట్లు రన్నర్‌తో సరిపెట్టుకున్నాయి. ఉరవకొండలోని జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 21 నుంచి జరుగుతున్న 28వ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలు సోమవారం ముగిశాయి. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల నుంచి సబ్ జూనియర్ బాల, బాలికల జట్లు పాల్గొన్నాయి. అనంతపురం, కృష్ణా జిల్లాల బాలబాలికల జట్లు ఫైనల్స్‌లో తలపడ్డాయి. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో కృష్ణా జిల్లాకు చెందిన బాల, బాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానోత్సవ సభలో ముఖ్య అతిథిగా భారతదేశ సెపక్‌తక్రా క్రీడల సంఘం ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా చైర్మన్ సప్తగిరి మల్లి, కార్యదర్శి షాహిన్, ఎస్‌కెఆర్‌సీ క్లబ్ ఉపాధ్యక్షులు ఎర్రిస్వామినాయుడు, ఆమిద్యాల రాజశేఖర్ హాజరయ్యారు. గెలుపోటములను సమానంగా స్వీకరించినపుడే క్రీడల్లో రాణిస్తారని వక్తలు తెలిపారు. అనంతరం విన్నర్స్, రన్నర్స్ జట్లకు పతకాలు, కప్‌లు, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో సీనియర్ పీడీలు మారుతిప్రసాద్, పుల్లా రాఘవేంద్ర, నాగరాజు, ప్రభాకర్, మంజునాథ్, జనార్దన్, శివకుమార్, రాయుడు, కృష్ణ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహిళపై అత్యాచారయత్నం

ఎన్పీకుంట: మేకలచెరువు గ్రామంలో పశువులకు కాపలాగా వెళ్లిన మహిళపై అత్యాచారయత్నం, దాడి జరిగింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి బాధితురాలు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 20వ తేదీ గొర్రెలను మేపేందుకు కొండపైకి వెళ్లిన మహిళా పశువుల కాపరిపై స్థానికుడైన రత్నమయ్య అత్యాచారం చేయబోయాడు. ఆమె ప్రతిఘటించి నెట్టేయడంతో ఆగ్రహించిన రత్నమయ్య కర్రతో ఆమెపై దాడి చేసి, కాలితో కడుపుపై తన్ని గాయపరిచాడు. అదే సమయంలో కొందరు అటుగా రావడంతో ఆమెను కిందకు తోసేసి పరారయ్యాడు. బాధితురాలు మరుసటి రోజు ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి కదిరి ఆస్పత్రిలో చేరింది. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపింది.

చట్టపరిధిలో పరిష్కారం చూపుతాం


అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్


అర్జీ చూపుతున్న అశ్వని

ఫిర్యాదుదారులకు భరోసా కల్పించిన ఎస్పీ

పుట్టపర్తి టౌన్: అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి చట్టపరిధిలో పరిష్కారం చూపుతామని ఎస్పీ సతీష్ కుమార్ భరోసా కల్పించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో 85 అర్జీలు అందాయి. ఎస్పీ స్వయంగా స్వయంగా వికలాంగుల వద్దకు వెళ్లి సమస్యలను ఓపికగా విని.. విని సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ చేసి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమస్య తీవ్రతను తెలుసుకొని చట్టపరిధిలో విచారించి పరిష్కారం చూపుతామని చెప్పారు. అర్జీలు పునరావృతమైతే చర్యలు తప్పవని పోలీస్ అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాసులు, సీఐ నరేష్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ల్యాబ్ రిపోర్టు ఇవ్వడం లేదు

తనకుమారుడు నితీష్ (3) మూడు నెలల కిందట అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని, అప్పట్లో బాబు అవయవాలు ఆర్‌ఎఫ్‌ఎస్‌ఎల్‌కు పంపించినా.. ఇంతవరకూ రిపోర్ట్‌లో ఏమి వచ్చిందనేది పోలీసులు చెప్పడం లేదని తలుపుల మండలం ముత్యాలవారిపల్లికి చెందిన సంధ్యారాణి ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తమకు అంగన్‌వాడీ సిబ్బందిపై అనుమానం ఉందని తెలుపుతూ.. ల్యాబ్ రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

దాడి చేసిన వారిపై చర్యలేవీ?

వినాయక నిమజ్జనం సందర్భంగా తమ ఇంటి ముందు అదేపనిగా టపాసులు పేల్చి.. అభ్యంతరం చెప్పినందుకు తనపైన, తన భర్తపైన అసభ్య పదజాలంతో దూషించడమే కాక బట్టలూడదీసి దాడి చేశారని, అయినా ఇప్పటి వరకు 12 మంది నిందితులపైనా ఎటువంటి చర్యలూ తీసుకోలేదని కొత్తచెరువుకు చెందిన అశ్వని ఎస్పీ దృష్టికి తీసుకొచ్చింది. వారి నుంచి తనకు ప్రాణ హాని ఉందని, రక్షణ కల్పించి, న్యాయం చేయాలని కోరింది. క్షేత్రస్థాయిలో విచారించి న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు.

అదనపు కట్నం కోసం పోలీసు వేధింపులు

రాప్తాడురూరల్: అదనపు కట్నం కోసం వేధించేవారిపై పోలీసులు చర్యలు తీసుకుంటారు. అలాంటి పోలీసులే వేధిస్తే ఎవరికి చెప్పుకోవాలి? అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ధర్మవరానికి చెందిన సూర్యనారాయణ, ఉరవకొండ ప్రాంత వాసి గాయత్రికి పదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, కూతురు సంతానం. వీరి కుటుంబం అనంతపురం రూరల్ పాపంపేటలో నివాసం ఉంటోంది. సూర్యనారాయణ కళ్యాణదుర్గం టౌన్ పీఎస్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. పెళ్లి సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. ఇటీవల అదనపు కట్నంపై ఆశపుట్టిన సూర్యనారాయణ తరచూ భార్యను వేధింపులకు గురి చేసేవాడు. పెద్దలు ఎన్నిమార్లు సర్దిచెప్పినా ఆయనలో మార్పు రాలేదు. సోమవారం భార్యపై విచక్షణారహితంగా దాడి చేశాడు. గాయాలపాలైన బాధితురాలు సర్వజన ఆస్పత్రిలో చేరింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

చేనేతల హామీల అమలులో నిర్లక్ష్యం


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న చేనేత కార్మికులు

పుట్టపర్తి అర్బన్: చేనేత కార్మికులకు ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని చేనేత ఐక్యవేదిక నేతలు ధ్వజమెత్తారు. హిందూపురం నుంచి చేనేత ఐక్య వేదిక ఆధ్వర్యంలో చేనేత కార్మికులు సోమవారం కలెక్టరేట్‌కు చేరుకుని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా చేనేత ఐక్యవేదిక అధ్యక్షుడు దేవరాజ్ మాట్లాడుతూ నేతన్న భరోసా కింద రూ.20 వేలు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని.. ముఖ్యమంత్రి చంద్రబాబు దాని గురించి పట్టించుకోలేదన్నారు. ఐదు నెలల కిందటే ఉచిత విద్యుత్ అమలుకు జీఓ విడుదల చేసినా ఎవ్వరికీ వర్తించలేదన్నారు. బిల్లులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి సమస్యను విన్నవించారు. విద్యుత్ బిల్లులు రీఫండ్ చేయిస్తామని కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు.

41 క్వింటాళ్ల బియ్యం పట్టివేత


పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని చూపుతున్న అధికారులు

తాడిమర్రి: ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా పేదలకు అందించే 41 క్వింటాళ్ల చౌకబియ్యాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టుకున్నారు. సీఎస్‌డీటీ శారద తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. వైఎస్సార్ కడప జిల్లా సింహాద్రిపురం మండల కేంద్రానికి చెందిన బి.శివకోటిరెడ్డి, ఆయన కుమారుడు జశ్వంత్ కుమార్‌రెడ్డి ఆదివారం తాడిమర్రి మండలంలోని గ్రామాల్లో కార్డుదారులతో కొనుగోలు చేసిన 41 క్వింటాళ్ల చౌకబియ్యాన్ని కొనుగోలు చేశారు. వాటిని వాహనంలో వేసుకుని తరలిస్తుండగా చిల్లవారిపల్లిలో పోలీసులు ఆపి తనిఖీ చేశారు. పీడీఎస్ ద్వారా పంపిణీ చేసిన బియ్యంగా గుర్తించి, కేసు నమోదు చేసి, వాహనాన్ని తాడిమర్రి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం అక్కడి నుంచి బియ్యంతో సహా వాహనాన్ని ధర్మవరం ప్రభుత్వ గోడౌన్‌కు తరలించి, అక్కడ నిల్వ చేశారు. నిందితులిద్దరినీ కోర్టుకు తరలించారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ శారద, పోలీసులు అనిల్, నరసింహులు, వీఆర్‌ఓ బాబాఫక్రొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి


మృతుడు రాజు


డీఎస్పీని కలిసిన మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు

ధర్మవరం రూరల్: ధర్మపురి గ్రామానికి చెందిన దేవరకొండ రాజు (31) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. కియా కార్ల తయారీ అనుబంధ పరిశ్రమలో పనిచేస్తున్న రాజుకు ధర్మవరానికి చెందిన నారాయణస్వామి కూతురు మన్వితతో మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కూతురు సంతానం. మన్విత ప్రస్తుతం తొమ్మిది నెలల గర్భంతో ఉంది. ఆదివారం ధర్మవరంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన తలారి చరణ్‌కుమార్‌తో కలిసి రాజు బైక్‌పై రావులచెరువు గ్రామానికి వెళ్లాడు. అదే రోజు అర్ధరాత్రి ఏమైందో తెలియదుగానీ రక్తగాయాలతో విగతజీవిగా పడి ఉన్నాడు. వెంట వెళ్లిన చరణ్‌కుమార్ ఎటు వెళ్లాడో తెలియడం లేదు. అటుగా వచ్చిన గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి రోడ్డు ప్రమాదంలో మరణించాడా.. లేక ఎవరైనా హత్య చేశారా అన్న కోణంలో విచారణ చేస్తున్నారు. ఇదిలా ఉండగా సోమవారం మృతుని బంధువులు డీఎస్పీ హేమంత్‌కుమార్‌ను కలిసి.. హత్య కేసుగా నమోదు చేయాలని కోరారు. రోడ్డు ప్రమాదమా.. హత్య అన్నది త్వరలోనే తేలుస్తామని డీఎస్పీ హామీ ఇచ్చారు.

ఎన్‌సీసీ కేడెట్స్ అరుదైన ఘనత

- దేశంలో ఆరో స్థానంలో జేఎన్‌టీయూ (ఏ)

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం) ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్స్ అరుదైన ఘనత సాధించారు. ఎన్‌సీసీ క్యాడెట్స్ సీనియర్ అండర్ ఆఫీసర్ (ఎస్‌యూఓ) కె.ప్రణతి (కంప్యూటర్స్ సైన్స్ విభాగం), కేడెట్ కేఎం అఖిల (సివిల్), బి.సౌజన్య (ఈసీఈ), పి.నఫియా (ఈఈఈ) ఏపీ, తెలంగాణ డైరెక్టరేట్ తరఫున ఈ నెల 1 నుంచి 12 వరకు నిర్వహించిన ఆల్ ఇండియా థల్ సైనిక్ క్యాంప్‌లో పాల్గొన్నారు. 70 రోజుల పాటు బ్రాహ్మణపల్లి, అనంతపురంలో నిర్వహించిన ఏడు ఎంపిక శిబిరాల్లో కఠినమైన శిక్షణలో నిష్ణాతులైన వారిని ఈ క్యాంప్‌కు ఎంపిక చేశారు. వీరిలో ప్రతిభ, సౌజన్య జడ్జింగ్ డిస్టెన్స్, ఫీల్డ్ సిగ్నల్స్ విభాగంలో, అఖిల, నఫియా మ్యాప్ రీడింగ్‌లో ప్రతిభ ప్రదర్శించి సత్తా చాటారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో దేశవ్యాప్తంగా ఆరో స్థానం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ డాక్టర్ శారద అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


మృతి చెందిన నరేష్

తనకల్లు: దండువారిపల్లి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోటపల్లికి చెందిన నరేష్ (34) తన సొంత ఐషర్ వాహనంలో ఓ రైతుకు చెందిన టమాటాల లోడ్‌ను కర్ణాటకలోని కోలార్ మార్కెట్‌కు తీసుకెళ్లాడు. అక్కడ అన్‌లోడ్ చేసి స్వగ్రామానికి బయలుదేరాడు. అయితే దండువారిపల్లి దగ్గరకు రాగానే ఐచర్ వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పెద్ద చెట్టును ఢీ కొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనాన్ని డ్రైవింగ్ చేస్తున్న నరేష్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోపి పేర్కొన్నారు.

జెడ్పీలో అక్రమాలు వెలుగు చూసేనా..?

- మొదలైన అకౌంటెంట్ జనరల్ ఆడిట్ ప్రక్రియ
- పది రోజుల పాటు కొనసాగనున్న ఆడిట్


రికార్డులు పరిశీలిస్తున్న ఆడిట్ బృందం

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ కార్యాలయంలో అకౌంటెంట్ జనరల్ (ఏజీ) ఆడిట్ ప్రక్రియ మొదలైంది. విజయవాడ నుంచి వచ్చిన ముగ్గురు అధికారులతో కూడిన ప్రత్యేక బృందం అనంతపురం జెడ్పీకి సోమవారం చేరుకుంది. 2019–2020 ఆర్థిక సంవత్సరం నుంచి 15వ ఆర్థిక సంఘం, జనరల్ ఫండ్, బీఆర్‌జీఎఫ్, ఎస్‌ఎఫ్‌సీ, ఇతర పద్దుల కింద ఇప్పటి వరకు చేసిన పనులకు సంబంధించిన అన్ని రికార్డులూ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. బడ్జెట్ రాబడులు-ఖర్చులకు సంబంధించిన ప్రతి అంశాన్నీ నిశితంగా చూస్తున్నారు. అయితే పాలకవర్గం అనుమతి లేకుండా కొన్ని, పాలకవర్గం తిప్పికొట్టిన మరికొన్ని పనులకు సంబంధించిన బిల్లులు గతంలో పని చేసిన సీఈఓలు, డిప్యూటీ సీఈఓలు, కింది స్థాయి సిబ్బంది కుమ్మక్కై డ్రా చేశారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ముఖ్యంగా ఓఅండ్ఎంకు సంబంధించి తప్పుడు అగ్రిమెంట్లు, నకిలీ బిల్లులు పెట్టి రూ.కోట్లు కొట్టేశారని గతంలో జెడ్పీటీసీ సభ్యులు జిల్లా పరిషత్ సాధారణ, స్థాయీ సంఘాల సమావేశాల్లో నిలదీశారు. అయినా అప్పటి అధికారులు కనీస విచారణ కూడా చేయలేకపోయారు. చివరకు లోకాయుక్తకు కూడా ఫిర్యాదులు చేసిన సంగతి తెలిసిందే. గ్రామాల్లో వీఎల్‌సీ (విలేజ్ లెవల్ కమిటీ) ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పనులను కూడా కొందరు అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై, బినామీ పేర్లతో పూర్తి చేసి రూ.కోట్లు స్వాహా చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా కదిరి నియోజకవర్గంలోని ఓ మారుమూల మండలంలో రూ.2 కోట్లకు పైగా ఇలా నిధులను ఓ అధికారి మరో కాంట్రాక్టర్‌తో చేతులు కలిపి దిగమింగారని తెలుస్తోంది. ఈ విషయంపై ప్రభుత్వానికి కూడా ఫిర్యాదులు వెళ్లాయని సమాచారం. ఈ నేపథ్యంలో ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయం నుంచి వచ్చిన ఆడిట్ అధికారుల పరిశీలనలో అక్రమాలు వెలుగు చూసేనా అని అందరూ ఎదురు చూస్తున్నారు. సుమారు పది రోజుల పాటు ఏజీ ఆడిట్ ప్రక్రియ కొనసాగుతుందని జెడ్పీ వర్గాలు తెలిపాయి. నిష్పక్షపాతంగా ఆడిట్ ప్రక్రియ కొనసాగితే అక్రమాలు వెలుగు చూసే అవకాశం లేకపోలేదని జెడ్పీ వర్గాలే అంటున్నాయి. మరి ఏం జరుగుతుందో వేచిచూడాలి.